# ప్రేమతో అమ్మ

పాలంకి సత్య



మీనాక్షికి మెలకువ వచ్చింది. గడియారం ఆరున్నర గంటలు చూపిస్తోంది. ఆలస్యమైపోయింది అనుకుంది మీనాక్షి. రోజూ ఇలాగే అవుతోంది. రాత్రి ఎంత ప్రయత్నించినా పన్నెండు కొడితే కానీ నిద్రపట్టదు. పడుకున్న మూడుగంటలకే మెలకువ వస్తుంది. తిరిగి ఏ తెల్లవారే ముందో నిద్ర పట్టడం. మెలకువ వచ్చేసరికి తెల్లగా తెల్లారిపోడం.

మీనాక్షి లేచి పళ్ళు తోముకుని వంటింట్లోకి వెళ్లింది. కోడలు కాఫీ ఇచ్చింది. కాఫీ వేడిగా లేదు. మీనాక్షి మాట్లాడకుండా కాఫీ తాగేసి కప్పు సింకులో పెట్టింది. కోడలు ''స్నానం చేసెయ్యండి. మీ తర్వాత ఇంకా మేమంతా చెయ్యాలి.'' అంది. చలి ఇంకా వణికిస్తోంది. ఎముకలు కొరికే చలిలో స్నానం చేస్తే వృద్ధాప్యంలో శరీరం తట్టుకోగలదా? ''ముందు మీరు చెసెయ్యండి. నేను ఆఖరున చేస్తాను.'' అంది మీనాక్షి. అక్కడే నిల్చున్న కొడుకు ''అలాగంటే ఎలాగమ్మా, స్నానం చెయ్యడానికి కూడా ఇంతగొడవ పెడితే ఇలా...'' అన్నాడు.

రెండేళ్ళ కొడుకుని సెలూన్‌కి తీసికెళ్లింది మీనాక్షి. భర్తది టూర్ల ఉద్యోగం. కొడుకుని సెలూన్‌కి తీసికెళ్ళడం వంటి పనులు మీనాక్షికి తప్పనిసరి. సెలూన్‌లో మంగలిని చూడగానే పారిపోడానికి ప్రయత్నించాడు చిన్నపిల్లవాడు. పరిగెత్తుకెళ్ళి కొడుకుని ఎత్తుకుంది. కుర్చీలో కూర్చోపెట్టలేకపోయింది. అందరూ వింతగా చూస్తున్నారు. పిల్లాణ్ణి ఎత్తుకుని నిల్చునే క్షవరం చేయించింది. చీరంతా వెంట్రుకలు పడ్డాయి. దులుపుకుందుకు కూడా అవకాశం లేకుండా పిల్లాడు ఏడుస్తున్నాడు. అలాగే ఇంటికి తీసుకొచ్చి స్నానం చేయించింది. చీరంతా తడిసిపోయి చలివేసింది. స్నానం పూర్తి చేయించి ఒళ్ళు తుడిచి, తల తుడిచి పౌడర్ రాసి బట్టలు వేసింది. అలసిన బాబు నిద్రపోయాడు.

మీనాక్షి నిట్టూర్చి బాత్రూంలోకి నడిచింది.

***

మీనాక్షి భోజనానికి కూచుంది. కోడలు కంచంలో కొద్దిగా పప్పూ, కూర, ఊరగాయా వేసి పక్కనే గిన్నెలో మజ్జిగ పోసి పెట్టింది.

మీనాక్షి పప్పూ, అన్నం కలిపి కొడుక్కి తినిపించ బోయింది. కొడుకు మారాం చేశాడు. వీధి గుమ్మంలో కూచోపెట్టుకుని వీధిలో వెళ్ళే కారుని చూపిస్తూముద్ద నోట్లో పెట్టబోయింది. వీధికుక్క తోకాడించుకుంటూ వచ్చింది. బాబు కుక్కని చూపించాడు. కుక్కకో ముద్ద పడేసింది మీనాక్షి. కుక్క తింటూ ఉంటే బాబు పకపక నవ్వాడు. ఓ ముద్ద తిన్నాడు. మళ్ళీ కుక్కను చూపించాడు. మీనాక్షి కుక్కకి ముద్ద పడేసి పిల్లాడికో ముద్ద పెట్టింది. కుక్క ఎక్కువా, బాబు తక్కువాగా భోజనం పూర్తయింది.

మీనాక్షి పప్పూ అన్నం కలుపుకుని తినబోయే లోగా కొడుకు ''అమ్మా ఆకలి..'' అంటూ వచ్చాడు. కలుపుకున్న పప్పూ అన్నం మళ్ళీ బాబుకి కొంచెం, కుక్కకు ఎక్కువగా తినిపించింది మీనాక్షి.

***

ముందు గదిలో కొడుకు వచ్చినవాళ్ళతో మాట్లాడుతున్నాడు. ఆ గొంతు ఎక్కడో విన్నట్లుంది. తెలిసిన వాళ్ళేమో. ముందు గదిలోకి వెళ్ళి చూస్తే తెలియని వాళ్ళయితే బాగుండు. మీనాక్షి ఆలోచనలలో ఉండగానే కొడుకు లోపలకు వచ్చాడు.

''ఎవరు బాబూ వచ్చింది?''

''ఎవరైతే ఏమ్మా. హాయిగా కృష్ణా రామా అనుకుంటూ తిని కూచోక అన్నీ ఆరాలు తీస్తావేం..''

''అమ్మా అదేంటి..''

''కాకి బాబూ.''

''అమ్మా అదేంటి.''

''కాకి బాబూ..''

''అమ్మా అదేంటి..''

''కాకి బాబూ''

''అమ్మా అదేంటి''

''కాకి బాబూ''

కొడుకు అడుగుతూనే ఉన్నాడు. మీనాక్షి చెప్తూనే ఉంది. కొంతసేపటికి కాకికే విసుగొచ్చింది కాబోలు ఎగిరిపోయింది. పిల్లవాడు తృప్తి చెందాడు.

మీనాక్షి కళ్ళలో నీళ్లు కళ్ళలోనే ఆపుకుంది.

***

టి.విలో ఎవరికీ నచ్చే ప్రోగ్రాం లేక అందరూ కలిసి టి.వి. ఆపేశారు. టివి పెట్టుకుందామని మీనాక్షి రిమోట్ కంట్రోల్ అందుకోబోయింది. అందుకోడంలో బేలన్స్ తప్పి మీనాక్షి కిందపడింది. రిమోట్ కంట్రోల్ చేతిలోనుంచి జారి కిందపడింది.

''ఎందుకమ్మా ఖరీదైన వస్తువులు కిందపడేస్తావు? నన్నడిగితే నేను పెట్టనా?''

బాబు బంతి ఆడుతున్నాడు. మీనాక్షి కొడుకుని ఇంట్లో ఆడవద్దని వారించింది. '' ఆఖరు సారమ్మా..'' అంటూ బంతి విసిరాడు. పై వరసలో పెట్టిన గాజు గ్లాసుల దొంతర కిందపడి భళ్ళున పగిలిపోయింది. అమ్మ ఎక్కడ తిడుతుందోనని కొడుకు ఏడవడం ప్రారంభించాడు. చప్పుడుకి భయపడి ఏడాది పాప ఏడవడం ప్రారంభించింది. చంటిపిల్లను ఎత్తుకుని కొడుకుని సముదాయిస్తూ గాజు ముక్కలు ఏరసాగింది మీనాక్షి.

''చెయ్యి బెణికినట్లుంది. కొంచెం ఆయింట్మెంట్ ఇయ్యమ్మా'' అంది మీనాక్షి.

***

రాత్రి ఆలోచిస్తూ పడుకుంది మీనాక్షి. చెయ్యి నొప్పి ఆమెను బాధిస్తోంది. ''ఏమీ మాట్లాడకుండా ఉండడం నేర్చుకో. లేకపోతే నీకు రోజులు గడవవు.''అని చెప్పి మరణించాడామె భర్త. ఏమీ మాట్లాడకుండానే ఉండాలి అనుకుంటున్న ఆమెకు పక్కగదిలోనుంచి మాటలు వినిపించాయి.

''చెయ్యి బెణికింది కాబట్టి సరిపోయింది. ఏ కాలో విరిగితే ఏం చెయ్యాలి. చచ్చే చావు. ఏ వృద్ధాశ్రమంలోనే చేర్చెయ్యండి.'' అంటోంది కోడలు.

కొడుకు ఏమంటాడోనని ఎదురు చూసింది కానీ ఇంక మాటలు వినిపించలేదు.

***

ఇది బాబూ జరిగిన కథ, జరుగుతున్న కథ. నేనేదో నిన్ను గొప్పగా పెంచాను కాబట్టి నువ్వు రత్నాలు నానెత్తికెత్తాలని నేను అనుకోడం లేదు. కొడుకు దగ్గర పోవడం కాశీలో పోవడంతో సమానమంటారు. నా ఆఖరు రోజులు నీ దగ్గర ప్రశాంతంగా గడిచిపోయి నేను నీ చేతుల్లో వెళ్ళిపోతే నాకంతే చాలు. ఆ ఒక్క కోరికా తీర్చమని కోరుతున్నాను. దీనికి ప్రతిగా నేను నీకేమీ ఇవ్వలేను. నేను ఉద్యోగం చెయ్యలేదు. నాకు పెన్షన్ రాదు. వెనక ఆస్తిపాస్తులు లేవు. నేను చెయ్యగలిగిందొక్కటే. నువ్వు ఆయురారోగ్యాలతో సకల సౌభాగ్యాలతో పుత్ర పౌత్రాభివృద్ధిగా కలకాలం జీవించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తాను.

ప్రేమతో

అమ్మ.




